క్లుప్తంగా

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

మానవపాడు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చంద్రకాంత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీల్లో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ప్రజలు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ద్విచక్రవాహనంపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తా.. తప్పిన ప్రమాదం

మానవపాడు: నారాయణపురం శివారు ప్రాంతంలో జాతీయ రహదారి–44పై డీసీఎం వాహనం బోల్తా పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఆళ్లగడ్డకు డీసీఎం వ్యాన్ కొరియర్ లోడ్‌తో వెళ్తుండగా జాతీయ రహదారిపై నారాయణపురం శివారు ప్రాంతంలో బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

'రైతుభరోసా'కు దరఖాస్తు చేసుకోవాలి



అయిజ: ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుభరోసా పథకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జనార్దన్ సూచించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఏఈఓలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఏఓ మాట్లాడుతూ.. గతంలో రైతుభరోసా వచ్చిన వారు మరలా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కొత్తగా పాసు పుస్తకాలు వచ్చిన రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



శాంతినగర్: పశువులకు తప్పనిసరిగా వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు వైద్యురాలు స్వరూపరాణి అన్నారు. వడ్డేపల్లి మండలం కోయిల్‌దిన్నె గ్రామంలో శుక్రవారం పశువులకు ముద్దచర్మ వ్యాధి నివారణ టీకాలు వేశారు. మొత్తం 135 ఆవులు, ఎద్దులు, 105 గేదెలకు లంపీస్కిన్ టీకాలు వేసినట్లు ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకాలను పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వరప్రసాద్, బుచ్చమ్మ, పాలాగు, వెంకటమ్మ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

ఉండవెల్లి: యువకుడు అదృశ్యమైన ఘటన మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్నూలు జిల్లా ఈ.తాండ్రపాడు గ్రామానికి చెందిన షబ్బీర్ బాషా(31) ఈ నెల 11న మానవపాడు బోరవెల్లి గ్రామంలో భార్య రజియా ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి 12వ తేదీన ఉండవెల్లిలో నివాసముంటున్న సోదరుడు రహీం ఇంటికి వెళ్తున్నానని చెప్పి అదృశ్యమైనట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంత వెతికినా షబ్బీర్ బాషా ఆచూకీ తెలియపోవడంతో షబ్బీర్ తండ్రి మహబూబ్ బాషా శుక్రవారం ఉండవెల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబ సభ్యుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ పేర్కొన్నారు.

గుప్తనిధుల తవ్వకంపై కేసు నమోదు

ఎర్రవల్లి: గుప్తనిధుల తవ్వకంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మురళీ తెలిపారు. వివరాలు ఇలా.. మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి గ్రామ కంఠం పరిధిలోని చెరువుకట్ట వద్ద వెంకటలక్ష్మమ్మ శిలాఫలకం కింద గత నెల 30న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం 15 అడుగుల లోతు గుంత తవ్వగా గమనించిన గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి కుర్వ వెంకటేశ్వర్లుకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో తవ్వకం జరిపిన ప్రదేశాన్ని అధికారి గుర్తించి తవ్వకాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం కోదండాపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బస్సులు లేవు.. బడికెళ్లేది ఎలా?

- ప్రైవేటు వాహనాలే దిక్కు
- లేదంటే నడవాల్సిందేనంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఉండవెల్లిలో పాఠశాలకు ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

ఉండవెల్లి: మండలంలో బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు నానా అవస్థలు పడుతున్నారు. సమయానికి పాఠశాలలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాలి లేదంటే నడకతప్పదని వాపోతున్నారు. బస్సు సౌకర్యం లేక, పాఠశాలలకు, ప్రభుత్వ కళాశాలలకు వెళ్లాలంటే ఇబ్బందులకు గురై చదువు మానుకోవాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు, పలు విద్యార్థి సంఘాల నాయకులు బస్సుల కోసం అధికారులకు వినతులు అందజేసిన పట్టింపులేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల విద్యార్థులే అధికం

మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉన్న 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు విద్యార్థులు 7, 8, 9, 10వ తరగతులు చదవడానికి వెళ్లేందుకు బస్సులేక ఇబ్బందులు పడుతున్నారు. ఉండవెల్లి పాఠశాలకు కంచుపాడు, చిన్న ఆముదాలపాడు, మారమునగాల–1, 2 గ్రామ పంచాయతీలకు సంబంధించిన విద్యార్థులు సొంత వాహనాలు లేదా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి బడికి వెళ్లే పరిస్థితి నెలకొంది. గతంలో నానా అవస్థలు పడ్డామని ఈ ఏడాదైన బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల విద్యార్థులు కోరుతున్నారు. మండలంలో మొత్తం 9 వ తరగతి నుంచి పదో తరగతికి వచ్చిన విద్యార్థులు 550కు పైగా ఉన్నారు. వీరందరూ తప్పకుండా సమీప గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసించాలని, ఈ క్రమంలో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాలని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలకు వెళ్లాలంటే సరైన సౌకర్యాలు విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపేస్తున్నారు. ముఖ్యంగా బాలికలు ఉన్నత చదువులకు దూరమవతున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బైరాపురంలో బాలికలతో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

తప్పక నడవాల్సిందే

మండలంలో మూడు గురుకుల పాఠశాలలు, ఒక కస్తూర్బా పాఠశాల ఉంది. పుల్లూరులోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక పుల్లూరు స్టేజీ నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు 2 కి.మీ మేర నడుచుకుంటు వస్తున్నట్లు తెలిపారు. కలుగోట్ల కస్తూర్బా పాఠశాలలో ఉపాధ్యాయులకు ప్రైవేటు వాహనాలే గతి అన్నట్లు ఉంది. అలంపూర్ చౌరస్తా నుంచి పోతులపాడు స్టేజీకి వచ్చి కలుగోట్ల గ్రామానికి కాలినడకనే వెళ్లాలి. ఉండవెల్లి గ్రామంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలకు జాతీయ రహదారి నుంచి ఉండవెల్లికి రావడానికి 1 కి.మీ, అక్కడి నుంచి పాఠశాలకు వెళ్లాలంటే మరోక 1 కి.మీ వెళ్లాల్సి ఉందని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులను కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

మా గ్రామం నుంచి 3 కి.మీ కాలినడకన పాఠశాలకు నడవాలి వస్తోంది. సొంత వాహనం లేక విద్యార్థులందరం నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తుంటాం. పాఠశాలకు వెళ్లే సమయానికి ఒక పిరియడ్ అయిపోతుంది. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి.

– దీక్షిత, మారమునగాల

వినతులు అందించాం

మండలంలో విద్యార్థులకు బస్సు సౌకర్యం వేయించాలని అధికారులకు తెలిపాం. ప్రజా ప్రతినిధులకు వినతులు అందజేశాం. వర్షం వచ్చిన, ఆటోలు లేకున్న పాఠశాలలకు రావడం లేదు. సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపేస్తున్నారు.

– రామకృష్ణ, ఎంఈఓ

రెవెన్యూ సదస్సులతో భూసమస్యలు పరిష్కారం



జూలెకల్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి నెట్‌వర్క్: గ్రామాల్లో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని అధికారులు సూచించారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సదస్సులో రైతులకు రెవెన్యూ సదస్సులపై అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరించారు.

★ అలంపూర్ మండలం సింగవరం గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సులను తహసీల్దార్ మంజుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సదస్సులో రైతుల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి, సీనియర్ సహాయకులు సుచిత్ర, ఆంజనేయులు, ఆర్ఐలు మాసుం బాష, దుర్గా సింగ్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

★ భూ భారతి చట్టంతో రెవెన్యూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ అన్నారు. మానవపాడు మండల పరిధిలోని బోరవెల్లి గ్రామంలో భూభారతి సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి 81 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కరుణాకార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

★ గట్టు మండల పరిధిలోని బోయలగూడెం గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సును తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడు ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతుల నుంచి మొత్తం 28 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

★ కేటీదొడ్డి మండలం పాగుంట గ్రామంలోని తహసీల్దార్ హరికృష్ణ ఆధ్వర్యంలో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్, ఆర్ఐ అశోక్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

★ వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 54 దరఖాస్తులు స్వీకరించినట్లు డీటీ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీరభద్రప్ప, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

★ ధరూరు మండల పరిధిలోని ర్యాలంపాడు, గుడ్డెందొడ్డి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్ నరేందర్‌పాల్గొన్నారు. అనంతరం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ అలివేలు మంగమ్మ, సీనియర్ అసిస్టెంట్ తిరుమలేష్, ఆర్ఐ తేజ పాల్గొన్నారు.

★ ఎర్రవల్లి మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ భూ సమస్యలకు సంబంధించి 16 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ నరేష్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు శంశీర్, శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సింగవరంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు



పాగుంటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ హరికృష్ణ

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ హేమలత

మల్దకల్: వర్షాకాలం వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సీడీపీఓ హేమలత, డాక్టర్ స్వరూపరాణి వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, డయేరియా వంటి వ్యాధులపై ప్రజలకు అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకునేలా వివరించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జయమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీధర్, వెంకటస్వామి, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు పారట్లేదు మహాప్రభో..



కమతంపేటలో శిథిలమైన మురుగు కాల్వ

అయిజ: మున్సిపాలిటీలోని కమతంపేట, తెలుగుపేటలో డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉంది. డ్రైయినేజీ నిర్మాణాలు కూలి మురుగు ముందుకు కదలని పరిస్థితి ఏర్పడిందని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతుండడంతో పాటు కాలువల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయంటున్నారు. దోమల ఉధృతి చెంది అనారోగ్యం బారిన పడుతున్నట్లు కాలనీ వాసులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు శిథిలమైన మురుగు కాల్వలను పునర్ నిర్మించాలని కోరుతున్నారు.

'జైనడిగడ్డ' యువత జిల్లా కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం జైనడిగడ్డ యువత జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికకు జిల్లా నాయకులు రామకృష్ణ, రమేష్ హాజరై మాట్లాడారు. విద్యా, వైద్యంతో పాటు సామాజిక కార్యక్రమాలకు యువత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం కమిటీ జిల్లా కన్వీనర్‌గా పల్లెరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే మండల కన్వీనర్లుగా మల్దకల్‌కు మధుగౌడ్, గట్టుకు రమేష్, అయిజకు నరేష్, వడ్డేపల్లికి లక్ష్మణ్, రాజోళికి గజేంద్ర, ఉండవెల్లికి ప్రవీణ్, మానవపాడుకు శాంతకుమార్, ఇటిక్యాలకు శివ, ఎర్రవల్లి మండలాలకు వెంకటేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ మహేందర్‌యాదవ్, రామాంజనేయులుగౌడ్, శ్రీనివాస్, అశోక్‌కుమార్, వీరేష్, సత్యం, మల్లికార్జున్, నర్సింహులు, మోహన్, వీరన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కమిషన్ ఛైర్మన్‌కు ఘన స్వాగతం



ఎర్రవల్లిలో కోదండరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రవల్లి: మండల కేంద్రంలో శుక్రవారం రాష్ట్ర రైతు సంక్షేమశాఖ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డికి కాంగ్రె నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో జరిగే రైతు సంక్షేమశాఖ సమీక్షకు వెళ్తుండగా అలంపూర్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జోగుల రవి ఆధ్వర్యంలో నాయకులు కూడలిలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, కమిషన్ సభ్యులు రాములునాయక్, భూమి సునీల్, భవానీరెడ్డి, వెంకటన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'సీడ్‌పత్తి రైతుల పొట్ట కొడుతున్నారు'



కమిషన్ ఛైర్మన్‌తో మాట్లాడుతున్న కుర్వ విజయ్

గద్వాల: కాంగ్రెస్ నాయకులు దళారులకు అండగా నిలిచి జిల్లాలో సీడ్‌పత్తి రైతుల పొట్ట కొడుతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కుర్వ విజయ్ మండిపడ్డారు. శుక్రవారం పుటాన్‌పల్లి గ్రామంలో రాష్ట్ర రైతు సంక్షేమశాఖ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి పర్యటన సందర్భంగా ఆయన్ను కలిసేందుకు వెళ్తున్న క్రమంలో అక్రమంగా అరెస్టు చేసి ధరూరు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీడ్ పత్తి పేరుతో జరుగుతున్న మోసాలను కమిషన్ దృష్టికి వెళ్లకుండా సమస్య ఉన్న ధరూరు, మల్దకల్, గట్టు, కేటీదొడ్డి మండలాల్లో జరగాల్సిన కమిషనర్ పర్యటనను సంబంధం లేని పుటాన్‌పల్లి గ్రామానికి మార్చినట్లు ఆరోపించారు. తక్షణమే సీడ్ పత్తి రైతుల సమస్యలు పరిష్కరించకపోతే రైతులతో కలిసి రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

అక్షరాభ్యాసంతో ఆరంభం..

- వేడుకగా పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం
- విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు పంపిణీ



జాంపల్లిలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ రవీంద్రబాబు

సాక్షి నెట్‌వర్క్: పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో ఎంఈఓలు, ఉపాధ్యాయులు విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 1వ తరగతి విద్యార్థుల చేత అక్షరాలు దిద్దించి పలకలు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను పంపించేందుకు తల్లిదండ్రులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

- ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలకే విద్యార్థులను పంపించేందుకు తల్లిదండ్రులు ప్రాధాన్యత కల్పించాలని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. కేటీదొడ్డి మండలం గువ్వలదిన్నె, వాగుతాండ, కేటీదొడ్డి, నందిన్నె పాఠశాలలోని ఎంఈఓ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉత్తమ గ్రేడ్లు సాధించి ఉన్నత స్థాయిలో నిలివాలన్నారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్పీ పాపయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- గట్టు మండల పరిధిలోని గొర్లఖాన్‌దొడ్డి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ నల్లారెడ్డి, హెచ్ఎం శశికాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 1వ తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- మానవపాడు మండలం బోరవెల్లి గ్రామంలోని అంగన్‌వాడీ పాఠశాలలో ఎంఈఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో చిన్నారులకు పలకలు, బలపం, సంచులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.
- ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన ఉంటుందని ఎంఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. ఇటిక్యాల మండల పరిధిలోని మునగాల ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులు, సిబ్బందితో కలిసి విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు.
- గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలందరిని బడిలో చేర్పించాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులకు సూచించారు. మల్దకల్, మద్దెలబండ, మద్దెలబండ పెద్దతండా పాఠశాలలో బడిబాట కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన చిన్నారులను స్థానిక ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న వసతులను వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అలంపూర్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జోగుల రవి అన్నారు. ఎర్రవల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బడిబాట కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అదే విధంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించి పుస్తకాలను పంపిణీ చేశారు.
- ధరూరు మండల పరిధిలోని జాంపల్లి ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా హెచ్ఎం రేవతి ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక అక్షరభ్యాసం కార్యక్రమానికి ఎంఈఓ రవీంద్రబాబు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి, ఎంఈఓ రవీంద్రబాబులు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ధరూరులో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధికారులు



బోరవెల్లిలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ శివప్రసాద్



మునుగాలలో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు



జింకలపల్లిలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

ఆత్మకూర్: ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టి.. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంఈఓ బాలరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఖుతుబ్ మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, టై, బెల్టులు, షూ, సాక్స్ అమ్మకాలను నిలిపివేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

గుంతల రోడ్డుతో అవస్థలు



కంకరతేలిన అయిజ- పులికల్ రోడ్డు

అయిజ: మండల పరిధిలోని పులికల్ రోడ్డు శిథిలమై నానా అవస్థలు పడుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. అయిజ నుంచి పులికల్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ పనులు పూర్తికాక మోకాటి లోతు గుంతలతో అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. కనీసం ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. గుంతల రోడ్డులో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.